ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శనివారం 25 అక్టోబరు 2025

వ్యక్తి దారుణ హత్య

- దేవరకద్ర మండలం అడవిఅజిలాపూర్‌లో ఘటన
- బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మాటు వేసి వేట కొడవళ్లతో ప్రాణం తీసిన దుండగులు

7

టపాసులు పేలి విద్యార్థులకు గాయాలు

- రేగడి తండాలో ఘటన

7


పాలెం వద్ద జరిగిన బస్సు ప్రమాద స్థలం వద్ద గుమిగూడిన ప్రజలు(ఫైల్)


గత సంవత్సరం బీచుపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో దగ్ధమౌతున్న జగన్ ట్రావెల్స్ బస్సు

ఉలికిపాటు!

శుక్రవారం ఉదయం నిద్రలేవంగనే ఉలికిపాటు... కర్నూలులో జరిగిన ఘోర ప్రమాదం.. బస్సులో సజీవ దహనమైన 19 మంది.. ఆ వెంటనే మదిలో మెదిలిన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం వద్ద జరిగిన ఘటన.. బస్సు కల్వర్టుకు ఢీకొని చెలరేగిన మంటల్లో 45 మంది సజీవ దహనమైన ఘటన.. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపూర్ వద్ద బస్సు దగ్ధమైన ఘటనలో 13 మంది సజీవ దహనం.. బీచుపల్లి వద్ద కృష్ణానదిలో రెండు బస్సులు పడి 76 మంది జలసమాధి... ఒకటేమిటి ఉమ్మడి జిల్లాలో జరిగిన అనేక ప్రమాదాలు యాదికొచ్చి అయ్యో.. అని ఒకింత ఆవేదన.. ఉలికిపాటు కలిగింది... ఓవర్‌టేక్ చేయడమో.... రాంగ్‌రూట్‌లో రావడమో... చిన్న ప్రమాదమో ఇందుకు కారణం కావచ్చు కానీ ఇలాంటి ఘటనలు ఉలికిపాటుకు గురిచేస్తున్నాయి...

కర్నూలు జిల్లా చిన్నటేకూరు ఘటనతో పాత దుర్ఘటనలు యాదికి..

- పాలెం వద్ద 12 ఏళ్ల క్రితం కూడా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం
- గత సంవత్సరం జనవరి 13న ఓ ప్రయాణికురాలు సజీవ దహనం
- అంతకుముందూ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదాలు
- ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యం, డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రధాన కారణాలు
- గమ్యం త్వరగా చేర్చడం కోసం పరిమితికి మించిన వేగం
- రెండు దశాబ్దాల్లో జాతీయ రహదారిపై ఆరు ఘోర ప్రమాదాలు

మహబూబ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారి 44పై ట్రావెల్స్ బస్సులో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే.. పడుకున్న వారు పడుకున్నట్లే నిద్రలో అగ్నికి ఆహుతి కాగా.. ప్రాణాలతో బయటపడ్డవారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ ఘోర ప్రమాదంతో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో జాతీయ రహదారిపై జరిగిన అనేక ప్రమాదాలను గుర్తుచేసుకుంటూ ప్రజలు ఉలికిపాటుకు గురయ్యారు. జాతీయ రహదారిపై ప్రమాదం అనగానే అందరూ 12 ఏళ్ల క్రితం పాలెం దుర్ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. అనాటి భయానక దృశ్యాలను యాదికి తెచ్చుకొని అలాగే తాజా ప్రమాదం జరిగిందని యాది చేసుకుంటున్నారు. అయితే పాలెం ప్రమాదంతో పాటు జాతీయ రహదారిపై రెండు దశాబ్దాల్లో దాదాపు ఆరు భారీ ప్రమాదాల్లో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగినప్పుడు కంటి తుడుపు చర్యలు తప్పా నిర్దిష్టంగా ప్రమాదానికి గల కారణాలను అన్వేషించి వాటిని సరిదిద్దడం, ప్రైవేటు ట్రావెల్స్ కంపెనీలకు సంబంధించి నిబంధనలు రూపొందించి అమలు చేయడం మాత్రం చేయడం లేదు. అప్పటి నుంచి జరిగిన మెజారిటీ ప్రమాదాలు అన్నీ స్లీపర్ బస్సులే కావడం గమనార్హం.. ఇటీవల రాజస్థాన్ జైపూర్‌లో కూడా జరిగిన ప్రమాదంలో దాదాపు 22 మంది ఆహుతి అయ్యారు. ప్రైవేటు కంపెనీలు ధనదాహంతో బస్సుల ఫిట్‌నెస్‌ను పట్టించుకోకపోవడం, రోజువారీ నిర్వహణ లేకపోవడం, డ్రైవర్లు త్వరగా గమ్యస్థానానికి చేర్చడం కోసం అతివేగంగా నడపటం, సరైన శిక్షణ లేని వారిని నియమించుకోవడం, వారు సరైన క్రమశిక్షణ చర్యలు పాటించకపోవడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.

అక్టోబరు పీడకల..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 200 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉన్నది. దీనిపై 80 కిలోమీటర్ల కంటే మించిన వేగంతో ప్రయాణం చేయకూడదు. కొన్ని చోట్ల అంతకంటే తక్కువ స్పీడ్‌తో ప్రయాణించాలి. కానీ, ట్రావెల్స్ బస్సులు రాత్రి 11 గంటలు అయ్యిందంటే 100 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేస్తుంటాయి. ఎందుకంటే ఉదయం వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను, ఇతరత్రా వృత్తుల వారిని బెంగళూరు లేదా హైదరాబాద్‌లో దించాలనే లక్ష్యంతో వెళ్తుంటాయి. ప్రయాణికులు కూడా తొందరగా గమ్యస్థానానికి చేర్చే బస్సులనే ఎన్నుకొని బుక్ చేసుకుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా పరిధిలో

(మిగతా 6లో..)

ఈ ఏడాదీ.. అంతేనా?

శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని వీడని సాంకేతిక సమస్యలు


తరచూ సమస్యలకు గురవుతున్న నాల్గో యూనిట్ స్టేటార్

- ఇంకా వినియోగంలోకి రాని నాలుగో యూనిట్
- రోటర్, స్టేటర్‌ల మధ్యలో తగ్గిన ఎయిర్ గ్యాప్
- సమస్యను గుర్తించినా పట్టించుకోని వాయిత్ కంపెనీ
- జపాన్ బృందాన్ని రప్పించేందుకు జెన్‌కో యత్నం

బ్రహ్మగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ సాంకేతిక సమస్యల కారణంగా ఈ ఏడాది కూడా వినియోగంలోకి రానట్లేనని జెన్‌కో అధికారులు చర్చించుకుంటున్నారు. జల విద్యుత్ కేంద్రంలో 2020 ఆగస్టు 20న రాత్రి బ్యాటరీలు మార్చుతుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, నాలుగో యూనిట్ పూర్తిగా దగ్ధమై వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. యూనిట్ మరమ్మతు పనులను జర్మనీకి చెందిన వాయిత్ కంపెనీ 2021లో ప్రారంభించి, 2023 జూలై చివరి నాటికి పూర్తి చేయడంతో, అదే నెలలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. 19 రోజుల వ్యవధిలో 70 గంటల పాటు యూనిట్‌ను నడిపించి 11.60 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. కాగా 2023, ఆగస్టు 17న స్టేటార్ వైండింగ్ బార్స్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, మరోసారి మంటలు చెలరేగడంతో సమస్య మొదటికొచ్చింది. 72 గంటలు విద్యుత్ ఉత్పత్తి చేయకుండానే నాలుగవ యూనిట్ కాలిపోవడంతో, జెన్‌కో యాజమాన్యం ఒత్తిడితో మరో సారి పనులు చేపట్టేందుకు వాయిత్ కంపెనీ

(మిగతా 6లో..)

ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు

మొరాయించిన నాలుగో యూనిట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు జెన్‌కో యాజమాన్యం ఇప్పటికే రెండు సార్లు శ్రమించి విఫలమైంది. పనులు చేపట్టిన వాయిత్ కంపెనీ చేతులెత్తేయడంతో, గతంలో జనరేటర్ పనులను పూర్తి చేసిన జపాన్ కంపెనీ ఇంజనీర్లను రప్పించేందుకు జెన్‌కో యాజమాన్యం యత్నిస్తోంది. అందుకు ప్రభుత్వ అనుమతికోసం ఎదురుచూస్తోందని తెలిసింది. అవసరమైతే ఇటీవల వాయిత్ కంపెనీ బిగించిన విడిభాగాలను పూర్తిగా తొలగించి, జపాన్ మెటీరియల్‌ను ఉపయోగించేందుకు కూడా నివేదికను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

మోడల్ సోలార్ విలేజ్‌గా మరికల్


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎంపిక
- 5,000 కంటే ఎక్కువ జనాభా కలిగిన గ్రామం కావడంతో..
- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద మోడల్ సోలార్ విలేజ్‌గా నారాయణపేట జిల్లాలోని మరికల్ ఎంపిక చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ప థకం జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని ప్రతీ జిల్లాలో ఒక గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా నిర్మించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. 5,000 కంటే ఎక్కువ జనాభా కలిగిన రెవెన్యూ గ్రామాన్ని పథకం కింద ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, ఎల్‌డీఎం విజయ్ కుమార్, రెడ్‌కో డీఎం మనోహర్ రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ నరసింహ రెడ్డి, డీపీవో పాల్గొన్నారు.

వైభవోపేతం..

పాలమూరులో ఘనంగా కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ


బోనాల ఉత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, జోగిని శ్యామల, ఆనంద్‌కుమార్ గౌడ్

- ఎల్లమ్మ తల్లి బోనాలకు పోటెత్తిన భక్తజనం
- తరలివచ్చిన గౌడ కుటుంబాలు
- ప్రత్యేక ఆకర్షణగా జోగిని శ్యామల
- ఉమ్మడి జిల్లాలో గౌడ జాతికి తొలి ఆలయ నిర్మాణం సంతోషకరం : మంత్రి జూపల్లి కృష్ణారావు
- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కి

7

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

- కేంద్రాల్లో నీడ, తాగునీటి వసతులు కల్పించాలి
- అవకతవకలకు పాల్పడితే చర్యలు
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి


ధాన్యం కొనుగోలు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, పీఏసీఎస్‌ల మానిటరింగ్ అధికారులు, కార్యదర్శులు, పాయింట్ ఇన్‌చార్జీలు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఈఓలు, ఏఓలు, రైస్ మిల్లర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న దృష్ట్యా కేంద్రాల ఇన్‌చార్జీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కేంద్రాల్లో నీడ, తాగు నీటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. జిల్లాకు 45 ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ యంత్రాలు వారంలో రానున్నయని తెలిపారు. రైతులు నిబంధనల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాల్లో ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నాణ్యత, సరైన తేమ శాతం ధాన్యానికి టోకెన్‌లు జారీ చేయాలన్నారు. కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు అనంతరం ధాన్యం మద్దతు ధర పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా సహకార అధికారి శంకరచారి, పౌరసరఫరాల సంస్థ డీఎం రవినాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, సహకార ఆడిట్ అధికారి టైటస్‌పాల్ పాల్గొన్నారు.


దున్నపోతుతో విన్యాసాలు చేయిస్తున్న యువకుడు

ఘనంగా సదర్ ఉత్సవాలు

- ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు

దామరగిద్ద, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాయ ఆలయం నుంచి గ్రామ పంచాయతీ వరకు నాలుగు దున్నపోతులను ఊరేగించారు. వాటితో చేయించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

వ్యక్తి అదృశ్యం

నవాబ్‌పేట మండలం లోకిరేవులో ఘటన

7

పేటలో వర్షం


అలుగు పారుతున్న సింగారం వాగు

- సింగారం వాగుకు పెరిగిన ఉధృతి
- నేలకొరిగిన వరి

నారాయణపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. సింగారం వాగుకు ఉధృతి పెరిగింది. జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వర్షం దంచికొట్టింది. దాంతో పట్టణంలోని రహదారులు జలయమం అయ్యాయి. విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలకు తడుస్తూనే వెళ్లారు. నారాయణపేట, మరికల్, మాగనూర్, కృష్ణ తదితర మండలాల్లో వరి పంట నేలకొరిగింది.

మాగనూర్‌లో 44.8 మిల్లీ మీటర్ల వర్షం

మాగనూర్ మండలంలో అత్యధికంగా 44.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, నర్వ మండలంలో అత్యల్పంగా 1.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దామరగిద్ద మండలంలో 32, నారాయణపేటలో 28.8, మక్తల్‌లో 20.8, ఊట్కూర్‌లో 16.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


వర్షానికి సింగారం శివారులో నేలకొరిగిన వరి పంట

శేషవాహనంపై వేంకటేశ్వరుడు


శేషవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వర స్వామి

చిన్నచింతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారు శేష వాహనంపై ఊరేగారు. స్వామి వారి గర్భగుడి నుంచి మెట్ల దారి పల్లకీలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా గోవిందనామ స్మరణ మారుమోగింది. కార్యక్రమంలో కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, త్రివేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'సిరసనగండ్ల' అభివృద్ధికి నిధులు కేటాయించాలి

» మంత్రి జూపల్లికి ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి



మంత్రి జూపల్లి కృష్ణారావుతో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ చారగొండ మండల నాయకులు

చారకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, చారకొండ మండల నాయకులు కోరారు. శుక్రవారం వారు హైదరాబాద్‌లో రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి మాట్లాడారు. గత ఏప్రిల్‌లో జరిగిన బ్రహ్మోత్సవాలకు హాజరైన సందర్భంగా, ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ అర్చకుడు ధేరం లక్ష్మణశర్మ, అగ్రహారంతండా మాజీ సర్పంచ్ ప్రశాంత్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కల్లు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే సీఎం ధ్యేయం

» కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



తిమ్మారెడ్డిపల్లిలో కాడా అధికారితో కలిసి బంజారా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి

కొత్తపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కోట్లాది నిధులు మంజూరు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కాడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి శుక్ర వారం ఆ యన భూమి పూజ చేశారు. రూ.50లక్షల వ్యయంతో ఎక్క మేడ్ లో నిర్మించనున్న హనుమాన్ ఆలయానికి, గోకుల్‌నగర్‌లో వేణుగోపాలస్వామి ఆలయానికి, అలాగే తిమ్మారెడ్డిపల్లిలో బంజార భవన్ నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. వీటితో పాటు రూ.15 లక్షల ఏసీడీఎస్ నిధులతో ప్రహరీ నిర్మాణానికి సైతం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండేళ్లలో నియోజకవర్గం రూపురేఖలు మార డం ఖాయమన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు న ర్సింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నిడ్జింత తిరుపతిరెడ్డి, చెన్నప్ప తదితరులున్నారు.

వివరాలివ్వని విద్యుత్ శాఖ

» అధికారులకు రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు

ఊట్కూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు ఇవ్వని విద్యుత్ శాఖ అధికారులకు రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు జారీ చేసింది. మండలంలో గ్రామాల వారీగా రైతులకు ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారు? కొత్త విద్యుత్ స్తంభాలు ఎన్ని ఏర్పాటు చేశారు? సబ్‌స్టేషన్‌కు ఎన్ని నిధులు వచ్చాయి? తదితర వివరాలు ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం పరిరక్షణ ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింహులు 2022, జనవరి 22న విద్యుత్ శాఖ మండల ఏఈకి దరఖాస్తు చేశారు. ఆయన సమాచారం ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 2న మక్తల్ డీఈకి అపీల్ చేశారు. ఆయన కూడా అడిగిన సమాచారం ఇవ్వలేదు. దీంతో దరఖాస్తుదారు నర్సింహులు రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ అంశంపై కమిషన్ స్పందిస్తూ విద్యుత్ శాఖ ఏఈ, డీఈలకు నోటీసులు జారీ చేసింది. ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు కమిషన్ ముందు హాజరు కావాలని ఆదేశించింది.


డ్రంకెన్ డ్రైవ్ కేసులో.. నలుగురికి జైలు శిక్ష

» రూ. 600 చొప్పున జరిమానా

కల్వకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు సీఐ నాగార్జున తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వారిని పోలీసులు శుక్రవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. వారిలో లింగాల మండలం కోమటికుంటకు చెందిన ఇంజమూరి శ్రీరాములకు 3 రోజులు, వంగూరు మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పెంకుల మధుకు 2 రోజుల జైలు శిక్ష విధించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బుద్దారం గ్రామానికి చెందిన మెల్గం రాజేందర్, వంగూరు మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన చాపల రమేశ్‌లకు ఒక రోజు జైలు శిక్ష విధించారు. అలాగే నలుగురికి రూ. 600 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి జడ కావ్య తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

» పెద్దకొత్తపల్లి దగ్గర చోటు చేసుకున్న ఘటన



వెంకటస్వామి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో హోంగార్డు వెంకట స్వామి(44) మృతి చెందినట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు. వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న వెంకటస్వామి విధి నిర్వహణలో భాగంగా ముష్టిపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆదిరాల దగ్గర రోడ్డుపై ఆకస్మికంగా కుక్క రావడంతో తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

వంటకు తంట

» వినియోగదారులకు సకాలంలో అందని గ్యాస్ సిలిండర్లు

» స్థానికంగా భారత్ గ్యాస్ ఏజెన్సీ లేక అవస్థలు

» పట్టించుకోని జిల్లా సివిల్ సప్లైయ్ అధికారులు

» కొత్త కనెక్షన్‌కు, కేవైసీ నమోదుకు తప్పని కష్టాలు



భారత్ గ్యాస్ సిలిండర్లు

కొల్లాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలో గ్యాస్ సిలిండర్లు సకాలంలో సరఫరా కావ డం లేదు. దీంతో ప్రజ లు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఎక్కువ మంది వినియో గదారులు భారత్ గ్యాస్ సిలిండర్లనే వినియోగిస్తున్నారు. కానీ పట్ట ణంలో ఏజెన్సీ లేక పో వడంతో సివిల్ సప్లై ఆ ధ్వర్యంలో వినియోగదారులకు సిలిండర్లు సరఫ రా చేస్తున్నారు. ఈ క్రమంలో కొల్లాపూర్‌లో డీలర్‌షిప్ లేనందున, 8 నెలల క్రితం భారత్ గ్యాస్ రాష్ట్ర సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఆ బాధ్యతను నాగర్‌కర్నూల్, లింగాల ఏజెన్సీలకు అప్పగించారు. అప్పటి నుంచి ప్రజలు తిప్పలు పడుతున్నారు. కొత్త గ్యాస్ కనెక్షన్ కావాలన్నా, కేవైసీ చేయించుకోవాలన్నా జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది.

సిలిండర్ల సరఫరాలో ఇబ్బంది

కొల్లాపూర్ మండలంలోని నల్లమల పరిసర గ్రామాల్లో భారత్ గ్యాస్ వినియోగదారులకు లింగాల మండలం నుంచి వారానికి ఒక్క రోజు మాత్రమే గ్యాస్ సప్లయ్ అవుతోంది. ఆ రోజు వినియోగదారుడు అందుబాటులో లేకపోయినా, లింగాల మండలం నుంచి వచ్చే గ్యాస్ డీలర్ మరిచిపోయినా మరో వారం రోజుల పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ మునిసిపల్ కేంద్రంతో పాటు మండలంలోని కొన్ని గ్రామాలకు భారత్ గ్యాస్ సిలిండర్ల సరఫరా ఉంది. స్థానిక యువకులు కొందరు సిలిండర్లను రవాణా చేస్తున్నప్పటికీ డీలర్ నుంచి సకాలంలో సరిపోయినన్ని సిలిండర్లు సప్లయ్ కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గంలో భారత్ గ్యాస్ నిర్వాహకులు లేకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు అందించే బాధ్యతను సివిల్ సప్లయ్ అధికారులు ఇష్టానుసారంగా నాగర్‌కర్నూల్, లింగాల ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా భారత్ గ్యాస్ డీలర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై డీఎస్‌వోను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈ అంశం తమ పరిధిలో లేదని, డీఎంనే అడగాలని సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» డీవైఎస్‌వో శ్రీనివాస్

» రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి ఉమ్మడి జిల్లా జట్టు పయనం



ఉమ్మడి జిల్లా బాలుర వాలీబాల్ జట్టుతో డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. భువనగిరిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు తరలివెళ్లింది. శుక్రవారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి జట్టు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు పలు అంశాల్లో విజేతగా, రన్నర్ నిలుస్తున్నదని గుర్తుచేశారు. కార్యక్రమంలో కోచ్, మేనేజర్ పర్వేజ్‌పాషా, విజయ్ పాల్గొన్నారు.

జట్టు వివరాలు...

ఆర్.సిద్ధు, ఏ.శివ, సందీప్, అరుణ్, మదన్, శివప్రసాద్, జ్ఞానేశ్వర్, ముఖీద్, చంద్రశేఖర్, రాకేశ్, మణికంఠ, శివకుమార్.

ఉలికిపాటు!



పాలెం వద్ద జరిగిన ప్రమాదంలో దగ్ధమైన బస్సు లోపలి భాగం (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

ఇప్పటివరకు మూడు అగ్ని ప్రమాదాలు జరగ్గా కర్నూలులో జరిగిన ఘటన కలుపుకుంటే జాతీయ రహదారిపై జరిగిన బస్సు అగ్ని ప్రమాదాలు నాలుగుగా చెప్పవచ్చు. తాజా ప్రమాదంలో 19 మంది చనిపోగా గతంలో 59 మంది అగ్ని ప్రమాదాల్లోనే సజీవ దహనమయ్యారు. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపూర్ వద్ద సెప్టెంబరు 25, 2002 సంవత్సరంలో హైదరాబాద్ నుంచి కడప జిల్లాలోని రాయచోటికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో మంటలు చెలరేగడంతో బస్సులో ఉన్న 31 మందిలో 13 మంది సజీవ దహనం కాగా 18 మంది తీవ్రంగా కాలిన గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను ఓదార్చడంతో పాటు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆ తర్వాత 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న జబ్బార్ ట్రావెల్స్ ఓల్వో బస్సు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం వద్దకు చేరుకోగా డ్రైవర్ అతివేగం కారణంగా కల్వర్టు వద్ద బస్సు డీజిల్ ట్యాంకర్‌కు రాపిడి జరిగి బస్సులో మంటల చెలరేగాయి. ఈ ఘటనలో 45 మంది నిద్రిస్తున్న సీట్లలోనే సజీవ దహనం కాగా ఏడుగురు ప్రాణాలతో బయటపడ్డారు. గత సంవత్సరం జనవరి 12న హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళుతున్న జగన్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బోల్తాపడి మంటలు చెలరేగడంతో హైదరాబాద్‌లోని ఇండియన్ రైస్ రీసర్చ్ సెంటర్‌లో ఫెలో సైంటిస్టుగా పనిచేస్తున్న మాలతి అనే మహిళ సజీవ దహనం అయ్యింది. అయితే గతంలో పాలెం దుర్ఘటన అక్టోబరు 30న జరగ్గా 12 ఏళ్ల తర్వాత అక్టోబరు 24న కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రమాదంలో 19 మంది చనిపోవడంతో అక్టోబరు పీడకల అని భావిస్తున్న పరిస్థితి. అయితే స్లీపర్ బస్సులపై ఇప్పటికైనా ఓ నేషనల్ లెవల్ కమిటీ వేసి లోపాలను సరిదిద్దే ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉంది.

76 మంది మృతి జలసమాధి

బీచుపల్లి వద్ద కృష్ణానదిపై గతంలో ఒక బ్రిడ్జి మాత్రమే ఉండేది. ఈ బ్రిడ్జిపై కూడా ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు, లేదా వాహనం వేగంగా నడిపినప్పుడు రెండుసార్లు భారీ ప్రమాదాలు జరిగాయి. అవి ఎంత అంటే మొత్తానికి మొత్తం ప్రయాణికులు జల సమాధి అయ్యేంత ఘోర ప్రమాదాలు సంభవించాయి. మొదట 1993 ఆగస్టు 2న కడప నుంచి హైదరాబాద్ వెళ్తున్న కడప ఆర్టీసీ డిపో బస్సు కృష్ణానది వద్దకు చేరుకున్న తర్వాత ఓవర్ టేక్ కారణంగా బస్సు నదిలో పడిపోయింది. అప్పుడు నదిలో నీరు వేగంగా ప్రవహిస్తుండటంతో బస్సులో ఉన్న దాదాపు 36 మంది జల సమాధి అయ్యారు. వారి మృతదేహాలను యాపర్ల, మునగమాన్‌దిన్నె, గుమ్మడం వద్ద కొన్ని రోజులపాటు వెతికిన తర్వాత వెలికితీశారు. అప్పటికే చేపలు, మొసళ్లు తిని మృతదేహాలు గుర్తుపట్టని విధంగా తయారయ్యాయి. ఆ ఘటన జరిగిన నాలుగేళ్ల తర్వాత 1997 సెప్టెంబరు 26న ఆళ్లగడ్డ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోయి కృష్ణానదిలో పడిపోయింది. ఆ సమయంలో బస్సులో 44 మంది ఉండగా.. 40 మంది మృతి చెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి మంత్రులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పుడు కూడా నది ఉధృతంగా ఉండటం, క్రేన్లు అందుబాటులో లేకపోవడంతో బస్సు వెలికితీత చాలా ఆలస్యమైంది. సమీపంలోని జాలర్లు తీవ్రంగా శ్రమించిన తర్వాత మూడు నుంచి నాలుగు రోజుల్లో మృతదేహాలను వెలికితీశారు. ఈ రెండు ఘటనల్లోనూ ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలోనే బస్సులు నదిలో పడిపోయాయి. పాత బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో అప్పుడు కొత్తగా మరో బ్రిడ్జి నిర్మించాలనే డిమాండ్లు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిరోజులకు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్త బ్రిడ్జిని నిర్మించారు. ఇక అప్పటి నుంచి వాహనాలు నదిలో పడిన ఘటనలు జరుగలేదు.

రేకుల షెడ్డులో వసతి గృహం

» అవస్థలు పడుతున్న విద్యార్థులు



గోపాల్‌పేట మండల కేంద్రంలో వసతి గృహం నిర్వహిస్తున్న ప్రైవేట్ రేకుల షెడ్డు

గోపాల్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గోదాం లాంటి రేకుల షెడ్డులో నిర్వహించిన వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో రెండు ఎస్సీ, ఒక బీసీ బాలుర, మరో బాలికల వసతి గృహాలున్నాయి.

నాలుగు హాస్టళ్లలో మూడు నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 400 మంది ఉన్నారు. వాటిల్లోని బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానికంగా ఓ పెద్ద రేకుల షెడ్డులోకి మార్చారు. ఆ షెడ్డుకు తలుపులు, కిటికీలు కూడా సరిగా లేవు. ఆవరణలో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగాయి. ఇటీవల వర్షాలు జోరుగా కురుస్తుండటంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. చలికాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

వసతిగృహానికి కనీసం దారి కూడా లేదు. దానికి సమీపంలోనే పందుల కొట్టం ఉండటంతో దుర్వాసన వస్తోందని, దీంతో భోజనం కూడా సంతృప్తిగా చేయలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతి గృహానికి నూతన భవనం నిర్మించాలని, అప్పటివరకు అన్ని వసతులున్న అద్దె భవనాన్ని అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సదుపాయాలు కల్పిస్తాం

బీసీ వసతిగృహం రేకుల షెడ్డులో ఉన్నది వాస్తవమే. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. హాస్టల్‌ను పరిశీలించి, సమస్యలను తెలుసుకుంటాను. మరీ ఇబ్బందిగా ఉంటే విద్యార్థులకు అనుకూలంగా ఉండే చోటుకు మారుస్తాం. కొత్త భవన నిర్మాణ ఆవశ్యకతను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– జమరుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

ఈ ఏడాదీ అంతేనా?



గతంలో కాలిపోయిన నాలుగో యూనిట్ స్టేటర్

(5వ పేజీ తరువాయి)

ముందుకొచ్చింది. అదనంగా మరో రూ.3 కోట్లు చెల్లించేందుకు జెన్‌కో యాజమాన్యం అంగీకరించింది. దీంతో గత ఏడాది వాయిత్ కంపెనీ మరోసారి పనులు చేపట్టింది. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమంలో ఏదైనా సాంకేతిక సమస్యతో ప్రమాదం సంభవించే పరిస్థితులుంటే ముందే పసిగట్టేందుకు స్టేటర్‌లో ప్రత్యేకమైన సెన్సర్లను బిగించారు. అయినా ఎటువంటి ప్రయోజనమూ లేకపోయిందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

మళ్లీ మొరాయిస్తున్న యూనిట్

మరమ్మతు పనులను రెండో సారి పూర్తి చేసిన వాయిత్ కంపెనీ సెప్టెంబరు 17న స్టేటర్‌లో రోటర్‌ను బిగించారు. ఇతరాత్రా పనులను పూర్తి చేసి ఈ నెల 2న, విజయదశమి పండుగ రోజు నాలుగో యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. పది గంటల పాటు విద్యుత్ ఉత్పత్తి జరగకముందే ఆ యూనిట్‌లో సాంకేతిక సమస్య ఏర్పడటంతో మళ్లీ మొరాయించింది. స్టేటర్, రోటర్‌ల మధ్య 17 సెంటీమీటర్ల గ్యాప్ ఉండాల్సి ఉండగా, 11 నుంచి 12 సెంటీమీటర్ల మేర ఖాళీ వచ్చింది. దీంతో యూనిట్‌ను రన్ చేసేటప్పుడు వైబ్రేషన్ రావడం, ఎయిర్ గ్యాప్ తగ్గడం వలన స్టేటర్ వేడెక్కడంతో వైండింగ్ బార్స్ కాలిపోతున్నట్లు ఇంజనీర్లు, ఉద్యోగులు ముందే గర్తించి హెచ్చరించారు. అయినా వాయిత్ కంపెనీ జనరేటింగ్ డిజైన్ ఇంజనీరింగ్ బృందం పట్టించుకోకపోవడంతో సమస్య మొదటికొచ్చింది.

ఈ ఏడాది ఉత్పత్తి లేనట్లేనా..?

సాంకేతిక లోపంతో మొరాయించిన నాలుగో యూనిట్‌లో స్టేటర్ వైండింగ్ బార్స్‌ను మార్చేందుకు చాలా సమయం పడుతుందని, దీని ద్వారా ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచే ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం కావడంతో ప్రభుత్వం నిర్దేశించిన 1500 మిలియన్ యూనిట్లు దాటి ఇప్పటికే రికార్డు స్థాయిలో 2000 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగలిగింది. గడిచిన ఐదు సంవత్సరాల్లో నాలుగో యూనిట్ ద్వారా సుమారు 1600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని కోల్పోయామని, దీంతో ప్రభుత్వానికి, జెన్‌కోకు దాదాపు రూ.800 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల జెన్‌కో సీఎండీతో విద్యుత్ కేంద్రం ఇంజనీర్లు సమావేశం అయ్యారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలన

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్



ఊర్కొండపేట అభయుడి ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్

ఊర్కొండ, అక్టోబరు, 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగి పోయారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండంలోని ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ కలహాలతో సతమతమవుతుండటంతో రాష్ట్ర ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అఖండ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ డ్రామాలకు తెరలేపిందని, బీజేపీని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. బీసీలు, రైతులు, ప్రజలందరూ కలిసి ఓడగొడతారనే భావనతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదని ఆరోపించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఎస్సీ మోర్చా మండల మాజీ అధ్యక్షుడు గడ్డం మహేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్, నాయకులు శ్యామ్‌సుందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, దివాకర్‌గౌడ్, తాడెం చిన్న, శేఖర్, శివకుమార్, నరేందర్‌గౌడ్, రాజ్ నారాయణరెడ్డి, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే విజయం సొంతం

» డీఎస్పీగా ఎంపికైన ఎస్ఐని సన్మానించిన ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కృషి, పట్టుదల ఉంటే ఎంతటి విజయమైన అలవోకగా సాధించవచ్చని ఎస్పీ జానకి అన్నారు. మహిళా భరోసా సెంటర్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత ఇటీవల గ్రూప్-1 పరీక్షలో డీఎస్పీగా ఎంపికై, ఉమెన్ పీఎస్ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఆమె సాధించిన విజయం పోలీస్ శాఖకు ఎంతో గర్వకారణమన్నారు. ఆమె స్ఫూర్తితో మరింత మంది పోలీసులు ఉన్నత స్థానంలో నిలబడేందుకు పోటీపడాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఎస్పీ సీసీ రామ్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలకు భవనం పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దేవసహాయం, డీఆర్‌డీవో ఓబులేష్

కందనూలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు ప్రతీనెల నిర్వహించే సదరం శిబిరాల కోసం శుక్రవారం అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారి ఓబులేష్‌లు ప్రత్యేకంగా స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న గదులు, ఇతర ఖాళీ స్థలం అదేవిధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఖాళీ స్థలం, గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ వి.శేఖర్, కార్యాలయ ఉపసంచాలకులు సీజే.వసంత్‌కుమార్, కార్యాలయ సూపరింటెం డెంట్ మిర్‌గాలిబ్ అలీ, ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, సిబ్బంది సహదేవ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య

» వేటకొడవళ్లతో దాడి..



దానం మైబన్న (ఫైల్)

దేవరకద్ర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని అడవిఅజిలాపూర్ గ్రామానికి చెందిన మైబన్న (45) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు వేట కోడవళ్లతో దాడి చేసి హతమార్చారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దీంతో మైబన్న హత్యకు గురి కావడతో గ్రామంలో అలజడి నెలకొన్నది. అదే గ్రామానికి చెందిన మైబన్న అనే వ్యక్తి దేవరకద్రలో మార్కెట్‌లో హమాలీ పని చేస్తూ జీవనం గడిపేవాడు. గురువారం తన పని ముగించుకొని రాత్రికి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో గ్రామానికి సమీపంలో మాటువేసి ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు వేట కొడవళ్లతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే రాత్రి అక్కడ గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అదేరాత్రి సీఐ రామకృష్ణ, పోలీసులు, సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. హత్యకు గురైన మృతదేహాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం అజిలాపూర్ గ్రామంలో హత్య జరిగిన సంఘటన స్థలాన్ని, గ్రామాన్ని పరిశీలించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

టపాసులు పేలి విద్యార్థులకు గాయాలు

మహబూబ్‌నగర్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు రాకపోవడంతో దారిలో దొరికిన టపాసులు కాల్చుతున్న సమయంలో పేలి గాయాలైన సంఘటన మహబూబ్‌నగర్ మండలంలోని రేగడితండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం తండాకు చెందిన విద్యార్థులకు పాఠశాలకు వెళుతుండగా దారిలో దొరికిన టపాసులను తీసుకొని వెళ్లారు. అయితే ఉపాధ్యాయులు సమయానికి రాకపోవడంతో రెండవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు టపాసులు పేల్చుతుండగా ప్రమదాం జరిగింది. స్థానికులు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లి డీఈవో, యంఈవో, ఉపాధ్యాయులు పరామర్శించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా

జడ్చర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వారికి జడ్చర్ల సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి నిర్మల జరిమానా విధించారని జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. అధిక మద్యం తాగి తనిఖీలలో పట్టుబడిన ఏడుగురిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వాహనదారులు నడిపిన వాహనాన్ని బట్టి, వారికి వచ్చిన ఆల్కాహల్ బీఏసీ లెవల్ ఆధారంగా జరిమానా విధించారని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



తూముకుంట వద్ద పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

వీపనగండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణి శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి తూముకుంట వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో నాగర్లబండ తండాకు చెందిన ఒకటి, వీపనగండ్లకు చెందిన మూడు ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాగిరెడ్డిపల్లిలో..

ఊట్కూర్,(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో పోలీసులు పట్టుకుని ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఊట్కూర్ ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. మండలంలోని పెద్దపొర్ల గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ తన ట్రాక్టర్‌లో నాగిరెడ్డిపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడనే సమాచారంతో నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రఘుపతిపేటలో..


కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం రఘుపతిపేట దుందుభీ వాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతానికి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తిమ్మరాసిపల్లి గ్రామానికి చెందిన జంగయ్య శుక్రవారం ఉదయం వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వట్లేదు..

» పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నవాబ్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇష్టపూర్వకంగా భూమి విక్రయిస్తామని చెప్పి రూ.19 లక్షల నగదు తీసుకున్నాడు.. ఏడాది గడిచినా భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు.. ఇచ్చిన డబ్బులూ ఇవ్వడం లేదంటూ పోలీసులను ఆశ్రయించాడు ఓ బాధితుడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... నవాబ్‌పేట మండలంలోని రేకులచౌడాపూర్ గ్రామానికి చెందిన దశరథ్ గ్రామ శివారులోని సర్వే నెంబరు 93లో ఎకరం భూమిని రూ.41లక్షకు అదే గ్రామానికి చెందిన రవికి విక్రయించాడు. ఒప్పందం చేసుకుని నగదుగా రూ.19లక్షలు తీసుకున్నాడు. అయితే నెలలు గడుస్తున్నా భూమి పట్టా చేయలేదు. దీంతో రిజిస్ట్రేషన్ చేయమని అడగగా ఇబ్బందులకు గురిచేస్తూ డబ్బులు ఇవ్వడం లేదని పోలీసులకు రవి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చుక్కల దుప్పి మృతి



చుక్కల దుప్పి మృతదేహం

మన్ననూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్య ప్రాంతంలోని మద్దిమడుగు రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ చుక్కల దుప్పి మృతి చెందింది. అమ్రాబాద్ అటవీ రేంజ్ పరిధిలోని మన్ననూరు పీటీజీ గురుకుల పాఠశాల పరిసరాల్లో గల మద్దిమడుగు రహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన చుక్కల దుప్పి కొట్టుమిట్టాడుతూ పీటీజీ ప్రహరీ గోడ సమీపంలో మృతి చెందింది. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందిం చడంతో, ప్రమాద స్థలానికి చేరుకున్నారు. చుక్కల దుప్పి మృతదేహానికి శవ పంచనామా చేసి, సమీప అడవిలోకి తీసుకెళ్లి పూడ్చివేసినట్లు అమ్రాబాద్ రేంజ్ అధికారి వీరేష్ కుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనా న్ని కనుగొనేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ట్రెజరీ ద్వారానే జీతాలు

● ఆశాలకు, ఎన్‌హెచ్‌ఎంలకు వచ్చే నెల నుంచి అందజేత



ఆశాల ఆధార్ కార్డులను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్న వైద్యసిబ్బంది

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆశాలకు, ఎన్‌హెచ్‌ఎంలకు ఇకపై వచ్చే నెల నుంచే ట్రెజరీ ద్వారానే జీతాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అందుకు సంబంధించి వైద్యసిబ్బంది వారి వివరాలను కంప్యూటర్‌లో పొందుపరిచేలా చర్యలు చేపట్టారు. గతంలో పీఎఫ్‌ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా జీతాలు ఇచ్చేవారు. ఇక వచ్చే నెల నుంచే ఐఎఫ్‌ఎంఐఎస్(ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) ద్వారా ట్రెజరీ నుంచి జీతాలు వచ్చేలా కమిషనరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో శుక్రవారం నుంచి ఆశాలు, ఎన్‌హెచ్‌ఎంల వివరాలను వైద్యసిబ్బంది కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నారు.

● **జిల్లాలో 604 మంది ఆశాలు..**

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 604 మంది ఆశాలు, 298 మంది ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్)కు సంబంధించి ఏఎన్‌ఎంలు, స్టాఫ్‌నర్స్‌లు, వైద్యసిబ్బంది ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో వీరి ఆధార్‌కార్డులను ఆన్‌లైన్‌లో వైద్యసిబ్బంది పొందుపరిచే ప్రక్రియను చేపట్టారు. శుక్ర, శనివారాలలో ఈ కంప్యూటర్‌లో పొందుపరిచే నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప తెలిపారు.

● **ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం**



తెలంగాణ ప్రభుత్వ కమిషనరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్ నుంచి ఆదేశాల మేరకు ఆశాలు, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది వివరాలను పొందుపరుస్తున్నామని, ఈ ప్రక్రియ ముగిసినవెంటనే వారి ఐఎఫ్‌ఎంఐఎస్ ఐడీ ద్వారా ఇక వారి వారి జీతాలు నవంబరు నుంచి ట్రెజరీ ద్వారా వస్తాయని ఆయన తెలిపారు.

\- డాక్టర్ సిద్దప్ప, డీఎంహెచ్‌వో

సామాజిక తెలంగాణతోనే

బడుగులకు న్యాయం

» రాష్ట్రాన్ని పదేళ్లు బీఆర్ఎస్ లూటీ చేసింది

» ఊరికి ఐదుగురు కాంగ్రెస్‌వాళ్లు దోపిడీ చేస్తున్నారు

» రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్

గద్వాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణతోనే బడుగులకు న్యాయం జరుగుతుందని రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. సామాజిక రథయాత్ర శుక్రవారం గద్వాలకు చేరుకుంది. అనంతరం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణను సాధించుకున్న తర్వాత సామాజిక తెలంగాణ కల సాకారం అవుతుందని భావించామని, కానీ ఒకే కుటుంబ పాలన సాగిస్తూ తెలంగాణను దోపిడీ చేసిందని విమర్శించారు. అన్ని రంగాలను సర్వనాశనం చేశారని దుయ్యబుట్టారు. వాళ్లను దించి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే వాళ్ల ఊరికి ఐదుగురు తయారు అయ్యారని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే వారందరు ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రైవేటు పరిశ్రమలలో స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు ఇచ్చే విదంగా చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 28లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించి సొంత పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేవిధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఆర్‌ఎల్‌డీ రాష్ట్ర నాయకులు మల్లేష్, రిషబ్ జైన్, నర్సింహ్మారావు, సుధాకర్, బుల్లెట్ వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం..

● పాలమూరులో కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



అభిషేకానికి నీటిని తెస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని ఎనుగొండ దేవుని గుట్టపై నూతనంగా నిర్మించిన గౌడ జాతి ఆరాధ్య దేవం సురమాంబ సమేత కంఠమహేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. సూర్యాపేట జిల్లా నిమికల్ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన గౌడ పూజారి కౌండిన్య బాసంపల్లి యాదగిరి పంతులు ఆధ్వర్యంలో వేదపండితుల శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నవగ్రహాది హోమం, అష్టదిక్పాకుల హోమంతో పాటు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి, పంచామృత అభిషేకం, జలాభిషేకాలు నిర్వహించారు. గౌడ కుటుంబాలతో పాటు సమీప కాలనీలోని భక్తులు బిందెలతో నీళ్లను తీసుకవచ్చి అభిషేకం చేశారు. ఉతయం నిర్వ హించిన అఖండ హోమంలో భక్తులు పెద్దఎత్తున సంప్రదాయ దుస్తులలో పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి కల్లుగీత పారిశ్రామిక సంఘాలు డప్పు వాయిద్యాలతో ఆలయా నికి చేరుకున్నారు. కంఠమహేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఉదయం జరిగిన అఖండ హోమంతో పాటు, ప్రాణ ప్రతిష్ఠ పూజలో సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాజీ టీపీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ ఎల్లగౌడ్, జిల్లా పెన్షన ర్ల సంఘం అధ్యక్షుడు సాయిల్‌గౌడ్, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్తూర్ వెంకటస్వామి గౌడ్, కార్యదర్శి యాదగిరి గౌడ్, రాజయ్యగౌడ్, గ్రేట్ ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, వెంకట్రాములు గౌడ్, బాలరాజు గౌడ్, చక్రవర్తి గౌడ్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి గుముడాల నరేందర్ గౌడ్, కలాల్ రవి, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు శాంతి భూషన్ గౌడ్‌లతో పాటు, గీత పారిశ్రామిక సంఘాల సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి బోనాలకు పోటెత్తిన భక్తజనం

కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎల్లమ్మ తల్లి బోనాలు ఎనుగొండలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి దేవుని గుట్టవరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ, ఏఐసీసీ నాయకుడు మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన జోగిని శ్యామల బోనమెత్తి నృత్యం చేస్తూ ఊరేగింపులో ముందుకు సాగారు. ప్రతీ గౌడ కుటుంబం నుంచి మహిళలు ఎల్లమ్మ, మైసమ్మ తల్లులకు బోనాలు ఎత్తారు. పోతురాజులు విన్యాసాలు చేశారు. ఎనుగొండ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి దేవుని గుట్ట వరకు ఊరేగింపు సాగింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత రెడ్డి, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లపై మునిసిపల్ అధికారుల ఆకస్మిక దాడులు

నారాయణపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో జీ షాన్, హిమాలయ రెస్టారెంట్లపై శుక్రవారం రాత్రి ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆధ్వర్యంలో మునిసిపల్ సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. జీ షాన్ రెస్టారెంట్‌లో చికెన్, మటన్, చేపల మాంసం పరిశీలించగా చేపల మాంసానికి ఎలాంటి పరిమితి, గడువు లేకుండా ఫ్రిజ్‌లో ఉంచారని, అలాగే తాజా చికెన్, మటన్ మాంసాన్ని ఫ్రిజ్‌లో నిలువ చేశారని కమిషనర్ తెలిపారు. అలాగే హిమాలయలో ఉడకబెట్టి కాల్చిన చికెన్ ఫ్రిజ్‌లో ఉంచారన్నారు. రెస్టారెంట్లలో ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన మాంసాన్ని ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు తేలిందన్నారు. రెండు రెస్టారెంట్లలో చేపల మాంసం, కాల్చిన చికెన్ శ్యాంపిల్స్‌ను సీజ్‌చేసి హైదరాబాద్ ల్యాబ్‌ల కు పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. ల్యాబ్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

మొసలి కలకలం

» సింగోటం శ్రీవారి సముద్రం వద్ద ప్రత్యక్షం

» తాళ్లతో బంధించిన గ్రామస్థులు



సింగోటం శ్రీవారి సముద్రం చెరువు కట్టపై కలకలం రేపిన మొసలి దృశ్యం

కొల్లాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సమీపంలో శ్రీవారి సముద్రం చెరువు కట్టపై రత్నగిరి గుట్ట వద్ద మొసలి కనబడడంతో సింగోటం గ్రామస్థులు కలవరపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో గురువారం సాయంత్రం చెరువు కట్ట వెనుక భాగం నుంచి మొసలి వస్తుండగా, అటుగా ట్రాక్టర్‌పై వస్తున్న రమేష్ గౌడ్ గమనించాడు. ట్రాక్టర్ డ్రైవర్ రమేష్, సావిడికాడి శ్రీను, కోళ్ల స్వామి ముగ్గురు కలిసి హరిత హోటల్ ప్రదేశంలో మొసలిని నీళ్లల్లోకి వెళ్లకుండా తాళ్లతో బంధించారు. రాత్రంతా అదే ప్రదేశంలో బందీగా ఉన్న మొసలి ఉదయం తాళ్లను విడిపించుకుని తిరిగి నీళ్లలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. సింగోటం గ్రామస్థులంతా ఒక్కటై మొసలిని నీళ్లలోకి వెళ్లకుండా బహిరంగ ప్రదేశంలోనే తిరిగి బంధించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. కొల్లాపూర్ అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మొసలిని బంధించి కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి సమీపంలో ఉన్న మొగులోతు ప్రాంతంలో కృష్ణానదిలో అటవీ అధికారులు మొసలిని వదిలిపెట్టారు. అటవీ సిబ్బంది భయ్యన్న, నీలేష్, శివ, ముజీబ్‌గోరి, లక్ష్మయ్య, కిరణ్, డ్రైవర్ శశి పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకులకు పేటెంట్ హక్కులు



డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ పండుగ రామరాజు, పీహెచ్‌డీ విద్యార్థి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీయూ అధ్యాపకులు 'నీటిలో ఆక్సీకరణం చేసే... పునర్వినియోగం చేయబడే ఆక్సీకరణ కారకాలు తయారు చేయడం' ద్వారా పేటెంట్ హక్కులు పొందారు. పాలమూరు యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో పని చేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రకిరణ్, ఇంటిగ్రేటెడ్ అధ్యాపకుడు డాక్టర్ పండుగ రామరాజు, పీహెచ్‌డీ విద్యార్థి శ్రీనివాస్ సంయుక్తంగా చేపట్టిన పరిశోధనల ఫలితంగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం పీయూలోని పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్ బాబు అభినందించారు. ఇలాంటి ఆవిష్కరణలు రసాయనశాస్త్రంలో పర్యావరణహితంగా ఆక్సీకరణ చర్యలు జరుపుటకు కొత్త నాంది అని వారు పేర్కొన్నారు. మెడిసిన్ కెమిస్ట్రీలో ఔషధాలను చాలా తక్కువ వ్యయంతో తయారు చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన డీసీఎం

» మహిళకు గాయాలు



ఆటోను ఢీకొట్టిన డీసీఎం

మహమ్మదాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డీసీఎం ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న మహిళకు గాయాలైన సంఘటన మహమ్మదాబాద్ మండలం దేశాయిపల్లి గేటు దగ్గర చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ వైపు వేగంగా వెళుతున్న డీసీఎం బస్టాండులోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును, ఆ పక్కన ఉన్న ఆటోను కూడా ఢీకొంది. ఆటోలో ఉన్న అంజమ్మకు గాయాలు కాగా, బస్సు ముందు భాగం కొంతమేర దెబ్బతినింది. గాయపడిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముసురుకే తడుస్తున్న ధాన్యం



వర్షాలకు తడువకుండా కవర్లు కప్పిన రైతులు

కొత్తకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రోహిణి కార్తెలో సాగు చేసిన వరి పంటల వద్ద ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏర్పాటు చేస్తానంటున్న కొనుగోలు కేంద్రాలు ఇంకా ఆచరణకు నోచుకోలేదు. అధికారులు మాత్రం సమావేశాలు నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్నారు. రైతులు మాత్రం పండిన పంట చేళ్లను యంత్రాల సహాయంతో కోతలు ప్రారంభించారు. కోసిన పంట ధాన్యాన్ని కల్లాలో పోసి ఆరబెట్టుతున్నారు. పొద్దస్తమానం మేఘాలు మబ్బులు కమ్ముకొని ఉండడంతో రైతులు ధాన్యాన్ని కుప్పపోసి కవర్లు కప్పుతున్నారు. మేఘాలు ఇలా భయపెడుతుండగా, అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం తుకాలు వేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నా రు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

నవాబ్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి కనిపించడం లేదంటూ ఆయన భార్య జంగమ్మ ఫిర్యాదు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న కూలీ పనులకు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయలుదేరి నేటికీ తిరిగిరాక పోవడంతో ఆందోళన చెందిన భార్య జంగమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

నాలుగు యూనిట్లకే జల విద్యుత్ ఉత్పత్తి పరిమితం

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో నాలుగు యూనిట్లు ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని చేపడుతున్నట్లు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ ఉత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా 1.365 మిలియన్ యూనిట్లు చేపట్టగా, ఇప్పటివరకు 450.582 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్లను ప్రారంభించి 1.365 మిల్లియన్ యూనిట్లను చేపట్టగా, ఇప్పటివరకు 437.582 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు.

తాగి రోడ్డెక్కితే జైలుకే..


జడ్చర్ల పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న ఎస్ఐ జయప్రసాద్ (ఫైల్)

» జడ్చర్లలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

» ఇటీవల జాతీయ రహదారిపై ప్రమాదాలు

జడ్చర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం ప్రియులకు పోలీసులు ఝలక్ ఇస్తున్నారు. తాగి రోడ్డెక్కితే పట్టుబడితే జైలుకే పంపిస్తామన్న హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు విడతల వారీగా తనిఖీ చేపడుతున్నారు. ఇటీవల జడ్చర్లలో రోడ్డు ప్రమాదాలు జరగడం, కొందరు మృతిచెందిన సంఘటనలున్నాయి. అతిగా మద్యం తాగి వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, తీవ్రంగా గాయపడిన అమాయకులు మృతి చెందుతున్నారంటూ పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో నిర్దిష్టమైన సమయంలో కాకుండా నిరంతరం తనిఖీ చేపట్టాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారితో పాటు మైనర్లు సైతం వాహనాలు నడుపుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సీఐ కమలాకర్ నేతృత్వంలో ఎస్ఐలు జయప్రసాద్, మల్లేష్, ఖాదర్ బృందాలు తనిఖీలు చేపడుతున్నారు.

మద్యం తాగి వాహనం నడపరాదు



మద్యం తాగి వాహనాలు నడపరాదు. వాహనాలు నడిపే వారికి డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తాము. పట్టుబడిన వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష పడిన సంఘటనలున్నాయి. తాజాగా ఏడుగురికి కోర్టు జరిమానా విధించింది. ప్రమాదాల నివారణకు సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము.

- కమలాకర్, జడ్చర్ల సీఐ

ఘనంగా పోచమ్మ బోనాలు


హజీలాపూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, అక్టోబరు 24 (ఆంధజ్యోతి): మండలంలోని హజీలాపూర్‌లో పోచమ్మ బోనాలు, ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. శుక్రవారం మూడో రోజు మహిళలు బోనం కుండతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామంలో పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరై పూజలు చేశారు.

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మండలంలోని దమగ్నాపూర్‌లో ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు.

దుశ్యంత్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు?

రాజాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య పేరిట ఓ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. మండల అధ్యక్షుడిని ఓ ఇంటర్వ్యూలో ఆరోపణలు చేస్తూ, వ్యక్తిగతంగా దూషించడంపై చర్యలు తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కాగా ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్యను వివరణ కోరగా, దుశ్యంత్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ లేఖను తానే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వీరి మధ్య ఓ భూవివాదం నడుస్తుందని మండలంలో చర్చించుకుంటున్నారు.

మెస్ ఫీజులు తగ్గించాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని సీపీజెట్ ద్వారా అడ్మిషన్ పొందిన ఎస్సీ విద్యార్థులకు సంబంధించి హాస్టల్ ఫీజులు పెంచడం సరైనది కాదని ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తిని రాము, రాజేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పీయూలోని పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ట్యూషన్ ఫీజులు ఇప్పుడు చెల్లించాలంటే పేదలను ఉన్నత విద్యకు దూరం చేయడం తప్ప మరొకటి కాదని, గతేడాది మాదిరిగానే ఫీజులు తీసుకోవాలని కోరారు. విషయంపై సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో విద్యులత, భానుప్రకాష్, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ


ఆలయ అర్చకుడికి కిరీటాన్ని అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మిడ్జిల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మావతి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పూజలను ఆలయ అర్చకుడు యుగంధరాచార్యులు నిర్వహించారు. కాగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్ చెందిన ఓ భక్తుడు స్వామి వారికి సమర్పించిన 600 గ్రాముల వెండి కిరీటాన్ని ఆలయ చైర్మన్ కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి భక్తుడి వద్ద స్వీకరించాడు. అనంతరం ఆలయ అర్చకుడికి అప్పగించి ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు. ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంత వెంకటేశ్వరస్వామి నామస్మరణతో మార్మోగింది.

ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక


జంగంరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

» పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్/ మహమ్మదాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గండీడ్ మండలంలోని జంగంరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు ఇస్తామని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 24మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. రెడ్డిపల్లి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం కోసం భూమి పూజ, వెన్నచేడులోని మాడల్ స్కూల్‌లో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పుష్పలత, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిచంద్రారెడ్డి, జితేందర్‌రెడ్డి, నర్సింహరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న, శంకరయ్య, వెంకన్నగౌడ్, పులిందర్‌రెడ్డి, మొగులయ్య, వెంకటేష్, కార్యదర్శి హైమావతి పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఆర్ఐ అహ్మద్, కేఎం నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, శాంతిరంగ్యానాయక్, రాంలాల్, చెన్నయ్య పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 (బాలికల) కబడ్డీ జట్టుకు ఎంపికైన సంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చందనను పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ, వీరాజీ, విష్ణువర్ధన్‌రెడ్డి, అబ్దుల్లా బీన్ అహ్మద్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా అరుణాచలంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు పాల్గొనే భక్తులకు డిలక్స్ బస్సును నడుపుతున్నట్లు డీఎం సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 రాత్రి 7 గంటలకు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని, తిరిగి నవంబరు 3న ఉదయం మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ సదుపాయాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

గో రక్షకులపై దాడులను అరికట్టాలి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గో రక్షకులపై దాడులను అరికట్టాలని తెలంగాణ చౌరస్తాలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పాలమూరు నగరంలోని రౌడీషీటర్ల వద్ద అక్రమంగా ఉన్న ఆయుధాలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. నగరం నలువైపుల రహదారులపై 24 గంటలు పనిచేసేవిధంగా పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ గోవు రవాణాలను అడ్డుకోవాని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

హన్వాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొర్రితండా గ్రామంలో అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం మాజీ సర్పంచ్ జూక్యానాయక్, తండా పెద్దలు భూమి పూజ చేశారు. తండాలో దేవాలయం దెబ్బతినడంతో కొత్తగా నిర్మించనున్నట్లు తెలిపారు.

అయ్యవారిపల్లిలో రేషన్‌కార్డుల పంపిణీ

మిడ్జిల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో రేషన్‌కార్డుల పంపిణీ చేసినట్లు గ్రామ పరిపాలన అధికారి వాహిద్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మీ శుక్రవారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు లబ్ధి చేకూరుతుందని ఇందిరమ్మ కమిటీ సభ్యులు చుక్కయ్య, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ, ప్రదీప్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, గోపాల్, బాల్‌రాజ్, బాలయ్య, భీమయ్య, రాములు, తిరుపతయ్య పాల్గొన్నారు.

తరలిన బీసీ సంఘం నాయకులు

భూత్పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీసీ సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు మండలంలోని సంఘం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మద్దిగట్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమ్మన్నగౌడ్ మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందకుండా పోయి తీవ్ర నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొల్గర చెన్నయ్య, రాజమల్లయ్య, గుడెం రాములు, శ్రీను, తిరుపతయ్య, రాములు, రవి, భాస్కర్, వెంకటయ్యగౌడ్, ఆంజనేయులు, సురేశ్ పాల్గొన్నారు.

26న రాష్ట్ర స్థాయి పరీక్ష

హన్వాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత గోసేవ విభాగ్ ఆధ్వర్యంలో గో విజ్ఞాన లెవల్-3 పరీక్షలు ఈ నెల 26న కేశవ మెమోరియల్ స్కూల్ నారాయణగూడ, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పాలమూరు, నారాయణపేట ఇన్‌చార్జిలు వెంకటయ్య, రఘోత్తం ఆచార్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులు గమనించి పరీక్షకు హాజరు కావాలని కోరారు.

నీరు వృథాగా పోతున్నా పట్టించుకోరా?


పోతులమడుగు శివారులో చెక్ డ్యాం తెగడంతో వృథాగా పోతున్న నీరు

భూత్పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పోతులమడుగు శివారులోని రాజీవ్ స్వగృహ వద్ద వాగుపై ఉన్న చెక్‌డ్యాం తొలకరి వర్షాల సమయంలో తెగిపోయింది. జిల్లా కేంద్రం నుంచి వచ్చే వర్షపు నీరు ఈ వాగు గుండా పోతులమడుగు మీదుగా పోల్కంపల్లి, కందూరు వాగులో కలుస్తాయి. పోతులమడుగు వాగు శివారులో చాలా చెక్‌డ్యాములు ఉన్నాయి. వీటి దారాఆ పరిసర ప్రాంతాల రైతుల బోరుబావులు ఏడాది పాటు ఎండిపోకుండా పుష్కలంగా సాగు నీరు అందుతుంది. ఈ చెక్‌డ్యాం తెగిపోయినందున శేరిపల్లి, పోతులమడుగు, గోపన్నపల్లి, అమిస్తాపూర్, గోప్లాపూర్ గ్రామాల భూగర్భ జలాలు పడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

బీసీ ధూంధాం విజయవంతం చేయాలి

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : బీసీ ధూంధాంను విజయవంతం చేయాలని ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం భరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం పీయూ పీజీ కళాశాల ఆవరణలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ధూంధాం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి 9వ షెడ్యూల్ చేర్చేవరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, విశారదన్ మహరాజ్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కుమారస్వామి, బత్తిని రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో అనర్థాలు


మల్లెబోయిన్‌పల్లిలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో విద్యార్థులు శీతాకాల శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగవ రోజు శుక్రవారం జడ్చర్ల మండలంలోని మల్లెబోయినపల్లిలో వలంటీర్లు ప్లాస్టిక్ సేకరించారు. గ్రామ ప్రజలకు ప్లాస్టిక్‌తో జరిగే నష్టాల గురించి వివరించారు. ప్రజలు శుభ్రతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీలక్ష్మి, సోని పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గండీడ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండెడ్డిపల్లి గ్రామంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుదుముల రాజు తండ్రి కుదుముల కొండయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకొని శుక్రవారం కుటుంబ సభ్యులను ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్నఈశ్వరప్ప పరామర్శించారు. వీరి వెంట ఏపీ రాములు, గిరెమోని శ్రీనివాసులు, విజయ్‌కుమార్‌రెడ్డి, మల్కయ్య, విజయ్‌కుమార్, బద్రేశ్వర్, మోహన్, మహేశ్ తదితరులు ఉన్నారు.

వసతి గృహాల తనిఖీ

నవాబ్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మన్‌గండ్ల ఎస్సీ, బీసీ వసతి గృహాలను సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సునీత శుక్రవారం ఎంపీడీవో జయరాములుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూరగాయలు, బియ్యం పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని, మెరుగైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

మార్కెట్‌కు భారీగా మొక్కజొన్న

నవాబ్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్ యార్డుకు శుక్రవారం 6,523 బస్తాలు (3,261 క్వింటాళ్లు) మొక్కజొన్న వచ్చినట్లు కార్యదర్శి రమేశ్ కుమార్ తెలిపారు. క్వింటాల్ గరిష్ఠ ధర రూ.2,071, కనిష్ఠంగా రూ.1,508, మాడల్ ధరగా రూ.1,963 వచ్చినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోరాదని సూచించారు.

దేవాలయాల్లో కార్తీక మాస పూజలు

దేవరకద్ర, అక్టోబరు 24 (ఆంధజ్యోతి): మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీక మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ చేపట్టారు. పట్టణ ఆర్యవైశ్యులు, మహిళలు పూజలు చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

» డబ్బులు ఇవ్వరాదనే సూచిక బోర్డులు పెట్టాలి

» ఆసుపత్రి మొత్తం నిఘా నీడలో ఉంచాలి

» జనరల్ ఆసుపత్రి సమీక్షలో కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జనరల్ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. శుక్రవారం జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన సమీక్షకు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ హాజరయ్యారు. గండీడ్ మండలం రేగడిగడ్డతండాలో పటాసులు పేలుస్తూ గాయాలపాలై జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అనంతరం ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలకు అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బందిపై ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆసుపత్రి పరిపాలన, డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయని, వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా జూనియర్ డాక్టర్లు ఎంఎల్‌సీ కేసుల విషయంలో, విధులపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వారిని సస్పెండ్ చేయడానికి వెనకాడేది లేదన్నారు. సిబ్బంది కూడా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిని విధుల నుంచి తొలగించాలన్నారు. అన్ని వార్డుల్లో డబ్బులు ఇవ్వరాదు అనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ప్రతీరోజు 170 మంది వరకు విధుల్లో ఉండాలని తెలిపారు. ఆసుపత్రిలో చోరీలు, కిడ్నాప్‌లు జరుగుతున్న నేపథ్యంలో పరిసరాలు, వార్డులు, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిఘా నీడలో ఆసుపత్రి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆసుపత్రికి మంచిపేరు తేవడంతో పాటు రోగులకు తక్షణ వైద్యసేవలను అందించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోగులు వస్తున్నారని, మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. సూపరింటెండెంట్ రంగా అజ్మీర, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, హెచ్‌వోడీలు, ఆర్ఎంవోలు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల జీవితాల్లో వెలుగు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్

పాలమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీసీల జీవితాలలో రాజ్యాధికారంతోనే వెలుగులు వస్తాయని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. శుక్రవారం బీసీ కులాల ఐక్యవైదిక ఉమ్మడి జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్‌తో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో బీసీలు ఉన్నతి సాధించి ఆత్మగౌరవంతో జీవించడానికి కేవలం రాజ్యాధికారంతోనే సాధ్యమన్నారు. బీసీ కులాలలో ఉన్న సంచార జాతులు, ఎంబీసీ కులాలందరికీ రాజ్యాంగ ఫలాలు అందడంతో పాటు అధికారంలో భాగస్వామ్యం దక్కాలన్నారు. బీసీల ఓటు బీసీలకే అన్న నినాదంతో ఓటును ఏకం చేసి రాజ్యాధికారాన్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సీటు బీసీలదే కావాలని, ఆ దిశగా చైతన్యాన్ని నింపే ప్రయత్నం జరగాలన్నారు. కార్యక్రమంలో దేవేందర్, మహేంద్ర, సంధ్యారాణి, లోకపల్లి భీమేష్, దండు శ్రీనివాసులు, ధర్మతేజ పాల్గొన్నారు.

ప్రారంభమైన కర్వెన రోడ్డు పనులు


పనులను పరిశీలిస్తున్న డీఈఈ లక్ష్మయ్యగౌడ్, నాయకులు

భూత్పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూత్పూర్ నుంచి కర్వెన గ్రామానికి వెళ్లె రోడ్డు పనులు రెండు రోజుల నుంచి ప్రారంభం అయ్యాయి. శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ డీఈఈ లక్ష్మయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. దాదాపు 9 కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు వేయడానికి ప్రభుత్వం రూ.4.50కోట్ల నిధులను మంజూరు చేసింది. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు డీఈఈ సూచించారు. రోడ్డు సౌకర్యం సరిగా లేక కర్వెన గ్రామస్థులతో పాటుగా మిట్యాతండా, బోట్లగడ్డతండా, లంబాడికుంట తండా ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ఈ విషయాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే రోడ్డు పనులకు నిధులను కేటాయించారని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపతిరెడ్డి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి


సదర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో నవంబరు 2న సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పీ.నర్సింహులు యాదవ్, చందు యాదవ్‌లను జిల్లా యాదవ సంఘం ఎంపిక చేసింది. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సదర్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే సదర్ ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా చరిత్రను ప్రథమంగా ఉంచేలా నిర్వహించాలని కమిటీ సభ్యులకు, యాదవ సంఘం నాయకులకు సూచించారు. ఉత్సవాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన్నారు. శాంతన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల ప్రణాళిక సిద్ధం చేయాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ధనుంజయగౌడ్

కోయిలకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2026-27లో ఉపాధి హామీ పనులు నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి పంపించాలని ఎంపీడీవో ధనుంజయగౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆచార్యపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శితో పాటు గ్రామస్థులు ఏ పనులు నిర్వహించాలన్న విషయాలపై చర్చించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, ఏపీవో నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ లలిత, కార్యదర్శి శ్రీజ, రాము, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.